ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

మంగళవారం 16 ఏప్రిల్ 2024





| ప్రాంతం | పుట్టపర్తి | కదిరి | ధర్మవరం | హిందూపురం | పెనుకొండ |
|---|---|---|---|---|---|
| గరిష్ఠం కనిష్ఠం | 39.0 24.0 | 38.0 24.0 | 39.0 25.0 | 38.0 23.0 | 37.0 23.0 |

పల్లె, పట్నంలో ఏరులై పారుతున్న మద్యం



- ఏటా అమ్మకాల్లో భారీ వృద్ధి
- అమ్మకాలు తగ్గితే.. లైన్‌లోకి ప్రభుత్వ పెద్దలు
- కల్తీ మద్యంతో అనారోగ్యం.. ప్రాణాపాయం..
- అతివలకు తప్పని కన్నీళ్లు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

ప్రభుత్వం మద్యంతో వ్యాపారం చేస్తోంది. అధికారంలోకి వస్తే సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తామని ప్రటించిన జగన్.. దానిని విస్మరించారు. అధికారం చేపట్టాక అందుకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు పెంచడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకున్నారన్నది బహిరంగ రహస్యమే. సొంత బ్రాండ్లతో నాసిరకం మద్యం తాగించి, మందుబాబుల ప్రాణాలు తీస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మద్య నిషేధం మాట అలా ఉంచితే.. ఏటా మద్యాన్ని ఏరులై పారిస్తూ ఆదాయం పెంచుకుంటోంది. మందుబాబుల బలహీనతను ఆసరాగా చేసుకుని.. ఆదాయం గడించేందుకు ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతో ఏదో చేస్తున్నామని మభ్యపెట్టి, తెరవెనుక పల్లెపట్నంలో ఊరూరా గొలుసు (బెల్టు) దుకాణాలు తెరిచారు. - ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



# పైసల కోసం.. ప్రాణాలు తీస్తున్నారు

జిల్లావ్యాప్తంగా స్థానిక వైసీపీ నాయకుల అండదండలతో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. వేళాపాళా లేకుండా విక్రయాలు సాగుతుండడంతో మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. టీడీపీ హయాంలో ప్రైవేటు యజమాన్యం చేతుల్లో ఉన్నా.. మద్యం షాపులను స్వయంగా ప్రభుత్వమే నిర్వహించే విధానాన్ని తీసుకొచ్చారు. 2019కి ముందు పట్టణ, మండలాల్లో ఎన్ని షాపులుంటే అంతకంటే ఎక్కువే వైసీపీ ప్రభుత్వం దుకాణాలను ఏర్పాటు చేసింది. ఒప్పంద ఉద్యోగులను పెట్టి మద్యం విక్రయాలను ప్రారంభించింది. ప్రతినెలా అమ్మకాలు పెరిగేలా ఒత్తిళ్లు తెస్తోంది. ఈనేపథ్యంలో ఐదేళ్లలో జిల్లాలో మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సరఫరా చేస్తున్న మద్యం బ్రాండ్లతోపాటు అమ్మకాలు తగ్గిగే ఆ జిల్లాపై రాష్ట్రస్థాయి అధికారులతోపాటు వైసీపీ పెద్దలు రంగంలోకి దిగి ఎందుకు తగ్గాయని ఆరా తీస్తూ సమీక్షలు చేసి మరీ అమ్మకాలు సాగించారు.

## రూ.1782 కోట్ల మద్యం తాగించారు..

జిల్లాలో 65 ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు 10 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. 2020 ఏప్రిల్ నుంచి 2024 మార్చిదాకా నాలుగేళ్లలో దాదాపు రూ.1782కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయంటే ఏటా మద్యం అమ్మకాల్లో ఎలా ఆదాయం వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. 2020-21లో రూ.349 కోట్లు, 2021-22లో రూ.432 కోట్లు, 2022-23లో రూ.492 కోట్లు, 2023-24 మార్చి 31కి రూ.509 కోట్ల మేర అమ్మకాలు సాగాయి. కదిరి, ధర్మవరం, పుట్టపర్తి పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లో సగటున రోజూ రూ.5 లక్షల దాకా అమ్మకాలు సాగే దుకాణాలున్నాయి. ఇలా సగటున నెలకు జిల్లాలో రూ.40కోట్లదాకా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఇక బార్ అండ్ రెస్టారెంట్లలో ఉదయం నుంచే అమ్మకాలు ప్రారంభమై, అర్ధరాత్రి దాటేదాకా సాగుతున్నాయి. గతంలో ధర్మవరం, కదిరి, హిందూపురంలో మాత్రమే బార్లు ఉండేవి. 2021 జూలైలో పెనుకొండ, మడకశిరలో కొత్త బార్లు తెరిచేశారు. జిల్లాలో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ కొత్త దుకాణాల ఏర్పాటుపై దృష్టి సారించారు. టూరిజం పేరుతో దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వం మద్యం దుకాణాలను మరిన్ని పెంచాలని ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు వచ్చాయి. దశలవారీగా నిషేధం విధిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో దుకాణాలు పెంచితే జనాలు తిరగబడతారేమోనని ఆ ప్రతిపాదన విరమించినట్లు తెలుస్తోంది. మరో అడ్డదారి వెతికారు. దుకాణాలు పెంచడం బదులు వేలాది సంఖ్యలో ఊరూరా బెల్టు షాపులు తెరిపించుకునేలా పరోక్షంగా సహకరించారన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా మద్యం ద్వారా ప్రభుత్వంతోపాటు అధికార పార్టీ నేతలు ఆదాయం గడిస్తున్నారు.

## పల్లెపట్నంలో ఏరులై..

ప్రభుత్వం మద్యం దుకాణాల సమయాన్ని తొలుత ఉదయం 11 నుంచి 6 గంటల వరకు ప్రకటించింది. తర్వాత దానిని క్రమేణా ఎనిమిది, తొమ్మిది గంటలు చేసింది. ప్రస్తుతం రాత్రి 10 గంటల వరకు అమ్మకాలు సాగించేలా ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ దుకాణాలు మూసిన తర్వాత కూడా పల్లెపట్నంలో బెల్టు దుకాణాల్లో మద్యం దొరుకుతోంది. ఈ ఇలా.. 24 గంటలపాటు మద్యం దొరికేలా వెలుసుబాటు కల్పిస్తోంది.



## తప్పని కన్నీళ్లు

మద్యం మహమ్మారికి ఐదేళ్లలో ఎన్నో జీవితాలు బలయ్యాయి. మద్యం మత్తులో ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయి. నాణ్యతలేని మద్యం తాగి, జిల్లాలో చాలామంది అనారోగ్యాం బారినపడ్డారు. వందలాది మంది చనిపోవడంతో ఆ కుటుంబాలు వీధిన పడ్డాయి. మద్యపాన నిషేధాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని ఆశపడిన మహిళలకు నిరాశే ఎదురైంది. అధికారంలోకి వస్తే దశలవారీగా మద్యం అమ్మకాలు నియంత్రిస్తామని హామీ ఇచ్చిన వైసీపీ.. దానిని పూర్తిగా విస్మరించింది. చివరికి మద్యం అమ్మకాలతో ఖజానా నింపుకునే స్థాయికి దిగజారడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో కర్ణాటక సరిహద్దులో కర్ణాటక మద్యానికి దారులు తెరిచారు. ఓవైపు ప్రభుత్వ, మరోవైపు కర్ణాటక మద్యం విచ్చలవిడి అమ్మకాలతో పల్లెపట్నాలు నిషామత్తులో తూలుతున్నారు. మద్యం అమ్మకాల్లో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు ప్రధాన పాత్ర పోషిస్తుండడంతో పోలీసులు వారివైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయలేని పరిస్థితి. ప్రభుత్వ దుకాణాలతోపాటు కర్ణాటక మద్యం అక్రమ రవాణాతో అనుసంధానంగా గొలుసుకట్టు దుకాణాలు పెరిగిపోతున్నాయి. టీకొట్టు దగ్గర నుంచి చిల్లర దుకాణాల వరకు పల్లె పట్నంలో ఎక్కడ కావాలంటే అక్కడ మద్యం లభిస్తోంది. చివరకు ఫోన్ కొడితే చాలు నేరుగా ఇంటికే మద్యం అన్న విధంగా ఏరులైపారుతోంది. జిల్లాలో కొన్నేళ్లుగా రోడ్డు ప్రమాదాలు సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల్లోపే అధికంగా జరిగినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. వీటిలో ఎక్కువ భాగం మద్యం మత్తులోనే జరిగినట్లు స్పష్టమౌతోంది. నాణ్యతలేని మద్యం సేవించి కొందరు మృత్యువాత పడుతుంటే.. వందలాది మంది అనారోగ్యంతో మంచాన పడుతున్నారు.



వసుంధరాదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొల్లకుంట అంజినప్ప

# రాక్షస ప్రభుత్వాన్ని సాగనంపుదాం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

హిందూపురం, ఏప్రిల్ 15: వైసీపీ రాక్షస ప్రభుత్వాన్ని సాగనంపుదామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దందాలు, భూకబ్జాలు సాగుతున్నాయన్నారు. సామాన్యులు బతికే పరిస్థితి లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంపై మహిళలు, యువతతోపాటు అన్నివర్గాల ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. వచ్చేనెల 13వ తేదీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. అనంతరం కొల్లకుంట అంజినప్ప చిలమత్తూరు మండలంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవికి పుష్పగుచ్ఛం అందించి, కృతజ్ఞతలు తెలిపారు.

పండగపూట

# వేతనాలివ్వకుంటే ఎలా?

మున్సిపల్ కమిషనర్ ఎదుట పారిశుధ్య కార్మికుల ఆవేదన



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నేతలు

పుట్టపర్తి, ఏప్రిల్ 15: ఉగాది పండుగ సమయంలో జీతాలివ్వకుంటే ఎలాగని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలంటూ మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రతినెలా ఒకటో తేదీ జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈనెలలో ఉగాది పండుగ ఉన్నా.. నేటికీ వేతనాలు చెల్లించకపోవడం సరి కాదన్నారు. జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. హెల్త్ అలవెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ నిధులను ఖాతాలకు జమ చేయాలన్నారు. సకాలంలో జీతాలు చెల్లించకపోతే ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక నేతలు నాగార్జున, నరసింహులు, రామయ్య, రమణ, గణేశ్, నాగరాజు పాల్గొన్నారు.

వైసీపీలో రాజుకుంటున్న

# అసమ్మతి

- కన్వీనర్ నిరాహార దీక్ష
- పోలీసుల ద్వారా దీపిక వర్గం బెదిరింపు

హిందూపురం, ఏప్రిల్ 15: హిందూపురం అధికార పార్టీలో అసమ్మతి రాజుకుంటోంది. మొన్నటి వరకు వైసీపీ అభ్యర్థి దీపికపై రెండు వర్గాల నాయకులు గుర్రుగా ఉండేవారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న వేళ దీపిక వర్గానికి చెందిన వైసీపీ పట్టణ బీ బ్లాక్ కన్వీనర్ వాల్మీకి నరేష్ పరోక్షంగా దీపిక వద్దు అంటూ సోమవారం మోడల్ కాలనీ సమీపంలోని తన వాటర్ ప్లాంట్ వద్ద నిరాహార దీక్షకు దిగారు. కొన్నినెలల క్రితం సమన్వయకర్త దీపికనే పట్టణ బీబ్లాక్ అధ్యక్షుడిగా వాల్మీకి నరేష్‌కి అవకాశం కల్పించారు. పదవి ఇచ్చారే తప్ప.. ఆయనకు



దీక్ష చేస్తున్న నరేష్

ఎలాంటి బాధ్యతలు అప్పజెప్పలేదు. దీంతో కొన్నిరోజులుగా సమన్వయకర్తపై గుర్రుగా ఉన్న నరేష్ సోమవారం నిరాహారదీక్షకు దిగారు. ఆయన మాట్లాడుతూ.. హిందూపురానికి మెడికల్ కళాశాల, జిల్లా కేంద్రం వచ్చేదనీ, అధికార పార్టీ నాయకులు ఆ దిశగా పనిచేయలేదన్నారు. నియోజకవర్గంలో కొన్ని సమస్యలున్నాయనీ, వాటిని పరిష్కరించడంలో నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిరాహారదీక్ష చేస్తున్న నరేష్‌కి బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీరాములు సంఘీభావం తెలిపారు.

## విరమింపజేసేందుకు యత్నాలు

నిరాహార దీక్షకు దిగిన వైసీపీ పట్టణ బీబ్లాక్ కన్వీనర్ నరేష్ వద్దకు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, టూటౌన్ పోలీసులు వెళ్లారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందనీ, నిరాహార దీక్షకు, శిబిరం ఏర్పాటుకు అనుమతులు లేవన్నారు. దీక్ష చేస్తున్న నరేష్‌కి కొంతమంది పోలీసులు ఫోన్ చేసి, దీక్ష విరమించుకోవాలని హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. సమన్వయకర్త దీపిక వద్ద ఉన్న కొంతమంది నాయకులు.. పోలీసులపై ఒత్తిడి తెచ్చి, దీక్ష విరమింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. నరేష్ నిరాహారదీక్ష చేయడం పురంలో చర్చనీయాంశంగా మారింది. సొంత పార్టీ కన్వీనరే పరోక్షంగా నిరాహార దీక్ష చేపట్టడం చూస్తుంటే అధికార పార్టీలో అసమ్మతి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.





అన్న క్యాంటీన్ వద్ద క్యూలో నిల్చున్న జనం (ఫైల్), భోజనం వడ్డిస్తున్న సిబ్బంది (ఫైల్)

# పేదల కడుపు మాడ్చిన జగన్

- అన్న క్యాంటీన్ల ద్వారా పేదల కడుపునింపిన టీడీపీ ప్రభుత్వం
- వైసీపీ అధికారంలోకి రాగానే మూసివేత
- నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

ధర్మవరం, ఏప్రిల్ 15: తెలుగుదేశం హయాంలో పేదల కడుపునింపేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని లేకుండా చేసింది. 2018లో పేదల ఆకలి తీర్చాలన్న ఆలోచనతో ఉమ్మడి జిల్లాలో 14 అన్నక్యాంటీన్లను అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఏర్పాటు చేశారు. హిందూపురం, పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, మడకశిరలో ఒక్కొక్కటి, ధర్మవరంలో 2 అన్న క్యాంటీన్లు నిర్మించారు. ధర్మవరంలో ప్రభుత్వాస్పత్రి, ఎంపీడీఓ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేసింది. వాటిలో రోజుకు 3వేల మంది దాకా భోజనం, అల్పాహారం చేస్తుండేవారు. పట్టు కేంద్రమైన ధర్మవరానికి రోజూ పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఇక్కడ హోటళ్లలో టిఫిన్ చేయాలంటే రూ.40, భోజనం చేయాలంటే రూ.60కిపైగా వెచ్చించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అన్న క్యాంటీన్లు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేవి. తక్కువ ధరకే టిఫిన్, భోజనం లభిస్తుండేది. దీంతో పేదలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలకు భోజన ఇబ్బందులు తప్పేవి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి రూ.5కే టిఫిన్, భోజనం లభించేది. అన్న క్యాంటీన్‌లో టిఫిన్ ఇడ్లీ, ఉప్మా, పొంగల్, పూరీ, భోజనంలో అన్నం, పప్పు, సాంబార్, పచ్చడి, పెరుగు ఇచ్చేవారు. ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు టిఫిన్, మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు భోజనం, రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు అన్న క్యాంటీన్ తెరిచి ఉండేది. దీంతో కళాశాలలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు సమయానికి ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చుకోకపోతే అన్న క్యాంటీన్‌లో చేసేవారు. రోజుకు ఒక్కో క్యాంటీన్‌లో అల్పాహారం 350, మధ్యాహ్నం, రాత్రి భోజనం 900 మందికి అందించేవారు. ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్ దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను మూసివేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మరికొన్ని ప్రాంతాల్లో సచివాలయాలుగా మార్చేశారు.

## గ్రామీణులకు ఎంతో ఉపయోగకరం



టీడీపీ హయాంలో ఏర్పాటుచేసిన అన్నక్యాంటీన్‌లో పేదలు కడుపునిండా అన్నం తినేవారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకుని, పట్టణాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. వైసీపీ పుణ్యమా అని వాటిని మూసేసింది. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు కడుపునిండా అన్నం దొరుకుతుంది.

- రామ్మోహన్, చిన్నూరుబత్తలపల్లి

## నాణ్యమైన భోజనం పెట్టేవారు: చెన్నప్ప, బుడ్డారెడ్డిపల్లి



గ్రామీణ ప్రాంతం నుంచి పని నిమిత్తం పట్టణానికి వస్తుంటాం. హోటల్‌లో టిఫిన్ చేయాలంటే రూ.40, భోజనం చేయాలంటే రూ.60 వెచ్చించాలి. అన్న క్యాంటీన్‌లో కడుపునిండా అన్నం తినేవారం. అది కూడా రూ.5కే టిఫిన్, భోజనం పెట్టేవారు. నాణ్యంగానూ ఉండేది. జగన్ అధికారం చేపట్టాక అన్న క్యాంటీన్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి.

# బాధితులపైనే కేసులా?

- పుట్టపర్తిలో పోలీసు వేధింపులు ఆపాలి
- సీఐ కొండారెడ్డిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు

పుట్టపర్తి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): పోలీసులు.. బాధితుల పక్షాన నిలబడాల్సిందిపోయి.. వారిపైనే అక్రమ కేసులు పెట్టి, వేధిస్తున్నట్లు మండలంలోని పెద్దకమ్మవారుపల్లి వాసులు.. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు సోమవారం ఫిర్యాదు చేశారు. విజయవాడలో బాధితుల తరఫున బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లికార్జునమూర్తి, కో-కన్వీనర్ హేమంత్, అప్పరావు, హనుమంతరావు.. ఎన్నికల ప్రధానాధికారిని కలిసి, పుట్టపర్తి పోలీసులపై ఫిర్యాదు చేశారు. గతనెల 23న పుట్టపర్తిలోని ఈశ్వరమ్మ పాఠశాల సమీపాన కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహన డోర్ తీయడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న పెద్దకమ్మవారుపల్లికి చెందిన లెక్కల దామోదర్‌నాయుడు మృతిచెందిన సంగతి తెలిసిందే. మృతుడి



రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ లీగల్ సెల్ నేతలు, పెద్దకమ్మవారుపల్లి సురేష్ నాయుడు

కుటుంబానికి న్యాయం చేయాలనీ, నిండు ప్రాణంతీసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బాధితులతోపాటు పెద్దకమ్మవారుపల్లి వాసులు పుట్టపర్తి అర్బన్ పోలీసు స్టేషన్ ఎదుట శవంతో నిరసన తెలిపారు. స్టేషన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ప్రమాదంపై విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ హామీతో నిరసన విరమించారు. పెద్దమనుషుల వద్ద పంచాయితీ చేసుకోవాలని సూచించడంతో పట్టణంలో ఓ డాక్టర్ వద్దకెళ్లారు. అనవసరంగా తమపై కేసు నమోదు చేయించారని బాధితుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా నిండు ప్రాణం తీసిన కారు యాజమానికి సీఐ సమీప బంధువు కావడంతో తమపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయించారని పెద్దకమ్మవారుపల్లి సురేష్ నాయుడు, మధుసూదననాయడు, లెక్కలనాయడు, సాయి.. ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేశారు. తాము టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నందునే వైసీపీ ఒత్తిళ్లతో మృతుడి బంధువులు 20 మందిపై కేసు నమోదు చేయించారని అందులో పేర్కొన్నారు. పుట్టపర్తిలో పోలీసులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారనీ, తాము ఎన్నికల్లో పాల్గొనకుండా అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వద్ద బాధితులు వాపోయారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరారు.

ట్రాక్టర్ల షోరూం కాదు..

# పోలీసు స్టేషనే..

పదుల సంఖ్యలో ట్రాక్టర్లు. అన్నీ కొత్తవిలా కనిపిస్తున్నాయి. వరుస సంఖ్యలో ఉంచారు. దీనిని బట్టి ఇదేదో ట్రాక్టర్ల షోరూం అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇది తాడిమర్రి పోలీసు స్టేషన్ ఆవరణమే. లీజు పేరుతో రైతుల నుంచి ట్రాక్టర్లు తీసుకుని, అమ్మేసిన కేసులో పోలీసులు దర్యాప్తు చేపట్టి, వీటిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసు వర్గాల సమాచారం మేరకు.. కడప జిల్లా పులివెందుల ప్రాంతానికి చెందిన బసిరెడ్డి బృందం జిల్లాలోని తనకల్లు, నల్లమాడ, నల్లచెరువు, పుట్టపర్తి, బత్తలపల్లి, కొత్తచెరువు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రైతుల నుంచి దాదాపు 200 ట్రాక్టర్లు లీజుకు తీసుకుంది. అది కూడా కొత్త ట్రాక్టర్లే కావాలని షరతు కూడా విధించారు. దీంతో కొత్త ట్రాక్టర్లనే రైతులు లీజుకిచ్చారు. గతేడాది డిసెంబరు వరకు లీజు మొత్తం సక్రమంగా చెల్లించారు. జనవరి నుంచి లీజు చెల్లించకపోగా.. ఫోన్ స్విచాఫ్ వచ్చింది. అనుమానం వచ్చిన రైతులు ఆ ప్రాంతానికి వెళ్లి విచారించగా బసిరెడ్డి ఆచూకీనే లేదు. రైతుల నుంచి ట్రాక్టర్లను లీజుకు తీసుకున్న బసిరెడ్డి వాటిని ఇతరులకు తక్కువ ధరకు అమ్మేశాడు. కొన్న రైతుల ద్వారా విషయం తెలుసుకున్న ట్రాక్టర్ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాడిమర్రికి చెందిన వారి నుంచి 11 ట్రాక్టర్లు లీజుకు ఇచ్చినట్లుగా కేసు నమోదైంది. కేసు విచారణకు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో ఇప్పటి వరకు 52 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, తాడిమర్రి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆ ట్రాక్టర్లను పులివెందుల, ప్రొద్దుటూరు, దర్శి, వినుగొండ, రాచర్ల, గిద్దలూరు, కనిగిరి ప్రాంతాల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరికొన్ని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న తరువాత వాటిని సంబంధిత యజమానులకు అందజేసేందుకు పోలీసులు సమాయత్తమవుతున్నారు. -తాడిమర్రి



పోలీసు స్టేషన్ ఆవరణలో ఉంచిన ట్రాక్టర్లు




# దోపిడీకి లైసెన్స్!



## ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా ఖనిజాల తరలింపు



- వైసీపీ నాయకుడి సంస్థకు రెండేళ్ల అనుమతి
- ఖనిజ సంపదను కొల్లగొడుతున్న 'అమిగోస్'
- నిబంధలకు విరుద్ధంగా తవ్వకాలు.. రవాణా
- నష్టపోతున్న ఇతర ప్రాంత లీజుదారులు



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15: దోపిడీకి లైసెన్స్ ఇచ్చినట్లుగా అమిగోస్ సంస్థ యథేచ్ఛగా జిల్లాలో ఖనిజసంపదను తవ్వేస్తోంది. ఉమ్మడి జిల్లాలో రెండేళ్ల తవ్వుకోవడానికి ఆ సంస్థకు అనుమతులిచ్చేశారు. ఇందుకుగాను ఆ సంస్థ ప్రభుత్వానికి రూ.259 కోట్లు చెల్లించాల్సి ఉంది. కడపకు చెందిన అధికారపార్టీ నాయకుడు, అనంతపురం నగరంలో ఓ కార్ల షోరూం యజమాని, సీఎంకు, పెద్దమంత్రికి ఆప్తుడు ఈ అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థలో భాగస్వాములుగా ఉన్నారు. ఈ సంస్థకు జిల్లాలోని కంకర, మట్టి, లేటరైట్, డోలమైట్, గ్రానైట్ ఖనిజాలపై పూర్తి హక్కులు కల్పించారు. ఆ సంస్థ మాత్రమే ఖనిజాలు తవ్వి, రవాణా చేసుకుంటూ వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ అమిగోస్ సంస్థ అనుమతికి మించి ఖనిజాలను తవ్వేస్తోంది. అలాగే స్థానికంగా తాత్కాలిక లీజుల పేరుతో అనుమతి తీసుకున్నట్లు పేపర్లను చూపుతూ యథేచ్ఛగా ఇతర జిల్లాలకు గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటోంది. దీంతో ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో లీజులు పొందినవారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదంతా ఆ సంస్థలోని వారు వైసీపీలో ఉండటంతోనే సాధ్యమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా వైసీపీ కళ్యాణదుర్గం అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులుగా అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ ఎండీ మల్లు ప్రసాద్‌రెడ్డిని నియమించడాన్ని చూపుతున్నారు.

### అనుమతికి నిరాకరించిన అధికారులపై బదిలీ వేటు

అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థకు జిల్లాలో ఖనిజ వనరులు తవ్వుకోవడానికి అనుమతి నిరాకరించిన జిల్లా గనులు భూగర్భశాఖ ఉపసంచాలకులపై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. గతేడాది మార్చి నెలలో ఇన్‌చార్జి డీడీగా ఉన్న తోట బాలసుబ్రహ్మణ్యం అమిగోస్ మినరల్స్‌పై ఆసక్తి చూపలేదని ఆయన్ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో కర్నూలు డీడీ తలారి రాజశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత వారానికే అమిగోస్ లైసెన్సు అగ్రిమెంట్‌కు సంబంధించి రాష్ట్ర శాఖ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఆ అగ్రిమెంట్‌పై డీడీ రాజశేఖర్ సంతకం చేయకపోగా, ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉంది, ఇలా చేయరాదని తిరస్కరించారు. దీంతో డీడీ బాధ్యతలు రాజశేఖర్‌కు తప్పించి వెంటనే అనంతపురం ఏడీగా ఉన్న తోట బాలసుబ్రహ్మణ్యానికి తిరిగి అప్పగించారు. వారం రోజులు తిరక్కముందే ఇన్‌చార్జి డీడీగా ఉన్న తోట బాలసుబ్రహ్మణ్యం ఎండీఎల్ కు సంబంధించి అగ్రిమెంట్‌ను తిరస్కరించారు. దీంతో ఇన్‌చార్జి డీడీ తోట బాలసుబ్రహ్మణ్యాన్ని వెంటనే సెలవుపై పంపించాలని అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధి ఒత్తిడి చేయడంతో గనులు భూగర్భశాఖ డైరెక్టరేట్ నుంచి సెలవు మంజూరు చేశారు. ఈ క్రమంలోనే తాడిపత్రి ఏడీగా ఉన్న ఎంపరాల నాగయ్యను ఇన్‌చార్జి డీడీగా నియమించారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని ఖనిజ సంపద కొల్లగొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీఎల్‌తో మరెంతమంది అధికారులు బలి అవుతారోననే చర్చ ఆ శాఖలో తీవ్రంగా జరుగుతుండటం గమనార్హం. కాగా అనంతపురం ఏడీగా ఉన్న తోట బాలసుబ్రహ్మణ్యాన్ని ఆ పదవి నుంచి కూడా తప్పించి ఏజీగా ఉన్న రామకృష్ణ ప్రసాద్‌ను ఇన్‌చార్జి ఏడీగా నియమించారు.

### ప్రైవేటు మోజులో ప్రభుత్వం

అమిగోస్ సంస్థపై ప్రభుత్వానికి మోజు అధికమైంది. ఈ సంస్థ కోసం ప్రభుత్వం జిల్లాలో సుమారు 40 ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనం. తాడిపత్రికి నాలుగువైపులా చుక్కలూరు, రాయలచెరువు, క్రిష్టిపాడు-గుత్తి రోడ్డులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే తాడిపత్రి నుంచి కడప, అనంతపురం, కొలిమిగుండ్ల, చుక్కలూరుకు వెళ్లే ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ప్రారంభించారు. రాయలచెరువు, క్రిష్టిపాడులలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అయితే ఇదివరకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయలేకపోయారు? ప్రైవేటు సంస్థ అమిగోస్‌కు లీజు ఇచ్చిన వెంటనే ఏర్పాటు చేయడంపై ఆశాఖ పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

### ప్రభుత్వ ఆదేశాల మేరకే..

ప్రభుత్వ ఆదేశాల మేరకే జిల్లాలో అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ ఖనిజ తవ్వకాలు, రవాణా చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సర్వ హక్కులు అమిగోస్ మినరల్స్‌కు రాష్ట్ర ఉన్నతాధికారులు అప్పగించారు. వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వానికి లీజు రూపంలో చెల్లిస్తున్నారు. తాత్కాలిక లీజులు అంటూ ఏమి ఉండవు. అమిగోస్‌కు ఇచ్చిన లీజులోనే మట్టి తరలింపు జరుగుతుంది. చెక్‌పోస్టులలో అనుమతి లేని తవ్వకం, రవాణా చేసే వాహనాల నుంచి రాయల్టీ వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లిస్తారు.



- నాగయ్య, జిల్లా భూగర్భగనుల శాఖ డీడీ

## 1 నుంచి వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15: జిల్లాలో మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు-2024 నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ షఫీ తెలిపారు. మొత్తం 50 సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించాలని శాప్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. అయితే ఇప్పటి వరకు 58 మంది కోచ్‌లు శిబిరాల నిర్వహణకు ముందుకు వచ్చారని తెలిపారు. కోచ్‌ల నుంచి వచ్చిన దరఖాస్తులను శాప్ అధికారులకు పంపామని, శాప్ నుంచి వచ్చే అనుమతి మేరకు సమ్మర్ క్యాంపులు ఉంటాయన్నారు.

## బైక్ రిపేరీలో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15: బైక్ రిపేరీపై ఉచిత శిక్షణ ఇస్తామని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, పది, ఇంటర్, ఐటీఐ చదివిన నిరుద్యోగ యువత అర్హులన్నారు. 45 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్‌లో నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఉచితంగా టూల్‌కిట్‌తో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 9390505952, 7780752418 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# గతమే ఘనం

- టీడీపీ పాలనలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు
- 17 ఏకరాల్లో 55 యూనిట్లకు వసతుల కల్పన
- ఔత్సాహికులకు రుణాలు, రాయితీలు
- భిన్న రీతుల్లో జీన్స్ ప్యాంట్ల తయారీ
- అభివృద్ధిని పట్టించుకోని వైసీపీ సర్కారు
- ఎన్నికల వేళ ఓడీ-ఓపీ ద్వారా ప్రచార ఆర్భాటం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 15: దేశంలోని నలమూలలు, విదేశాలకు జీన్స్ ప్యాంట్లను ఎగుమతి చేసేలా టీడీపీ ప్రభుత్వం జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకు రాయదుర్గం పట్టణ సమీపాన 17ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ స్థలంలో జీన్స్ వస్త్రాల తయారీకి అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించింది. ఇందులో భాగంగా 55 యూనిట్లను ఏర్పాటుచేసేలా ఒక్కో యూనిట్‌కు 20 సెంట్ల చొప్పున స్థలాన్ని కేటాయించింది. యూనిట్ల కోసం శాశ్వత భవనాలను నిర్మించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) అప్రూవల్స్ ఇప్పించింది. దీంతో టెక్స్‌టైల్ పార్క్‌ద్వారా రోజుకు సగటున 60వేల జీన్స్ ప్యాంట్లు తయారవుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మంది జీవనోపాధి పొందుతున్నారు. వీరితోపాటు వందల కుటుంబాలు కుటీర పరిశ్రమలాగా వారి ఇళ్లనుంచే స్టిచింగ్, కటింగ్, కలరింగ్, ఐరన్ తదితర పనుల చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాయి. ఇదంతా గతం. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి ఎలాంటి ప్రోత్సాహకం అందడంలేదు. ముఖ్య మంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచే పెట్టుబడి రుణాలను, రాయితీలను ఎత్తివేశారు. కనీసం మార్కెటింగ్ సదుపాయాన్ని కూడా కల్పించడంలేదని ఇటు యూనిట్ల వ్యవస్థాపకులు, జీవనోపాధి పొందుతున్న వర్గాలు వాపోతున్నాయి.

### రూ.500కోట్ల టర్నోవర్...

టెక్స్‌టైల్ పార్క్ ఏడాదికి రూ.500 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. తద్వారా ట్యాక్స్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం లభిస్తోంది. గుజరాత్‌లోని అహ్మదా బాద్ వస్త్రతయారీ పరిశ్రమ నుంచే నేరుగా ముడి వస్త్రాన్ని టన్నుల్లో తీసుకువస్తారు. అనంతరం ప్యాంట్స్‌ను తయారుచేసి ఎగుమతి చేస్తారు. ఈ ప్రక్రియలో రవాణా, మార్కెట్, అమ్మకాలు తదితర రూపాల్లో పన్నుల ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం జమ అవుతుందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

### ఆకట్టుకునే స్టైల్స్...

యుతను ఆకట్టుకునేలా జీన్స్ ప్యాంట్స్ టెక్స్‌టైల్ పార్కులో తయారవుతున్నాయి. కార్గో, టీసీ ప్యాంట్లు, టెరీ కాటన్, బర్ముడా బూట్‌కట్, కంఫర్ట్, పెన్సిల్ కట్, హాఫ్ తదితర డిజైన్లతో ప్యాంట్లు తయారు చేస్తున్నారు. వాటిపై వెల్వెడ్ ఆబ్లిక్ వర్క్, లెదర్ అబ్లిక్ వర్క్, ఫోమ్‌ఎంబోజ్, కమికల్ ఎంబోజ్, ప్రింటెడ్ వంటి రకరకాలతో ఆకృతుల అందాలద్దీ యువతను ఆకర్షిస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, గోవా వంటి ప్రాంతాలతోపాటు ఇతర దేశాలకు చెందిన పలు బ్రాండెడ్ జీన్స్ కంపెనీలు, మాల్స్ నుంచి ఆర్డర్లు వస్తుంటాయి. ఒక్కో ప్యాంట్ రూ.250 నుంచి రూ.600లకే తయారుచేసి ఇవ్వడంతో ఆర్డర్లు ఇచ్చేందుకు కంపెనీలు ఎగబడుతుంటాయి. తయారీ ధరలను బట్టి మార్కెట్‌లో ఒక్క ప్యాంట్ రూ.2వేల వరకు అమ్ముకుంటారు.



ముడి సరుకు

### జగన్ ప్రభుత్వ సహాయ నిరాకరణ...

టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమలు ఏర్పాటుచేసే వారికి పలు బ్యాంకు లు దాదాపు రూ.కోటి వరకు ఆర్థికసాయం చేయగా, పరిశ్రమల శాఖ రాయితీలను ఇచ్చింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు యూనిట్ రుణంలో 50శాతం, పురుషులకైతే 40 శాతం రుణం మంజూరు చేసింది. బీసీ మహిళలకు 45శాతం, పురుషులకు 35శాతం, ఇతరుల కు చెందిన మహిళలకు 20శాతం, పురుషులకు 15శాతం రాయితీలను మంజూరు చేసిందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుతో అన్నిరకాల సహాయ, సహకారాలను ఎత్తివేశారని మండిపడుతున్నారు. ముడిసరుకు ధరలు, తయారీ ఖర్చులు పెరిగి గిట్టుబాటు కాకపోవ డంతో యూనిట్లు మూతవేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.



ప్యాంట్స్‌కు చేతిపనులు చేస్తున్న మహిళ

### ప్రచార ఆర్భాటం

క్షేత్రస్థాయిలో టెక్స్‌టైల్ పార్కు దుస్థితి ఇలా ఉంటే వైసీపీ ప్రభుత్వం మరోలా ప్రచారం చేసుకుంటోంది. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో తయారవుతున్న ఉత్పత్తులకు కేంద్రప్రభుత్వం ఓడీ-ఓపీ(వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్) ద్వారా ప్రచారాన్ని కల్పిస్తోంది. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా 762 జిల్లాలో 1102 ఉత్పత్తులను ఎంపికచేసింది. ఏపీలో 13ఉమ్మడి జిల్లాలనుంచి 38ఉత్పత్తులను ఎంపికచేశారు. వీటిలో అనంతపురం ఉమ్మడి జిల్లానుంచి రాయదుర్గం జీన్స్ పరిశ్రమతో పాటు ధర్మవరం పట్టుచీరలు, నిమ్మలకుంట తోలు బొమ్మల ఉత్పత్తులను ఓడీ-ఓపీలోకి చేర్చింది. ఈ మూడు రంగాలు అంతర్జాతీయంగా జిల్లాకు పేరు ప్రఖ్యాతులను తెచ్చిపెట్టాయి. వైసీపీ ప్రభుత్వం ఇన్నాళ్లు ఎటువంటి సాయం చేయకపోగా ఎన్నికవేళ గొప్పలు చెప్పుకోవడానికి మీ ఫొటోలు, మాటలు వీడియో రూపంలో పంపాలని చెబుతోందని టెక్స్‌టైల్ పార్కు వర్గాలు మండిపడుతున్నాయి.



క్లాత్‌ను కట్ చేస్తున్న కార్మికుడు



జీన్స్‌ప్యాంట్స్ తయారీలో నిమగ్నమైన కార్మికులు

# వలంటీర్ల బరితెగింపు

జిల్లాలో పలువురు వలంటీర్లు, రేషన్ డీలర్లు బరితెగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. మరి కొందరు వలంటీర్లయితే వైసీపీకి ఎన్నికల ప్రచారం చేయడం కోసం మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రొళ్ల, ఏప్రిల్ 15: మండలంలో వలంటర్ దేవరాజు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, జడ్పీటీసీ అనంతరాజ్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సోమవారం భాజయ్య పాళ్యం, కాకి పంచాయతీలో నిర్వహించిన ప్రచారం పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ దేవరాజు

### ఆర్‌బీవంకలో వలంటీర్లు, డీలర్లు..

రాయదుర్గంరూరల్: మండలంలోని ఆర్‌బీవంక గ్రామంలో ఈ నెల 13న జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పలువురు వలంటీర్లు, డీలర్లు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన మంజునాథ్‌నాయక్, పాపారాజునాయక్, భోజరాజు, డీలర్ జగదీష్‌నాయక్ ప్రచారంలో పాల్గొనడం గ్రామంలో చర్చనీయాంశమైంది.



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు, డీలర్లు

### 102 మంది వలంటీర్ల రాజీనామా

కదిరి అర్బన్, ఏప్రిల్ 15: మండలంలో 102మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ అంజనప్పకు అందించారు. మండలంలో 187మంది వలంటీర్లు ఉండగా ఇప్పటికే ఐదుగురు రాజీనామా చేయగా ప్రచారంలో పాల్గొన్న ఏడుగురిని విధులనుంచి తొలగించిన విషయం తెలిసిందే.

- బెళుగుప్ప మండలంలోని శ్రీరంగాపురం సచివాలయం పరిధిలో పనిచేస్తున్న తొమ్మిదిమంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. గ్రామ సెక్రెటరీ శ్రీరాములుకు రాజీనామాపత్రాన్ని అందజేశారు.



ఎంపీడీఓకు రాజీనామాపత్రాన్ని అందజేస్తున్న వలంటీర్లు

### ఒకరి తొలగింపు

గోరంట్ల, ఏప్రిల్ 15: ఎన్నికల నియామవళిని ఉల్లంఘించిన మండలంలోని గుత్తివారిపల్లి వలంటీర్ రమ్యను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ, ఎంసీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. మంత్రి ఉషశ్రీచరణ్ శనివారం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తుండగా ఆమెతో వలంటీర్ రమ్య సెల్ఫీ దిగారు. ఈ ఫొటోతో స్థానికులు సీ విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేయడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరిశీలించి వలంటీర్‌కు నోటీసుల జారీ చేశారు. సంజాయిషీ కోరిన అనంతరం సోమవారం వలంటీర్‌ను తొలగిస్తూ ఎంపీడీఓ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని ఎనిమిది మంది వలంటీర్లు తమ రాజీనామాలను ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం అందించినట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 443 మంది వలంటీర్లుండగా, ఇప్పటివరకు 146మంది రాజీనామా చేశారు.

# ఆకట్టుకున్న చాందినీ బండ్ల మెరవణి

- భక్తులతో కిటకిటలాడిన వేమన ఆలయం

గాండ్లపెంట, ఏప్రిల్ 15: యోగి వేమన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రెండోరోజు ప్రత్యేకంగా అలంకరించిన చాందినీ బండ్ల మెరవణి ఆకట్టుకుంది. మండలంలోని కుటారుపల్లిలో యోగివేమన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు భక్తులు ఎద్దుల బండ్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ తిప్పారు. అనంతరం పానకం సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. రాత్రి చాందినీ బండ్ల మెరవణి చేశారు. పురవీధుల్లో తిరిగి ఆలయం వరకు బండ్ల మెరవణి సాగింది. బండ్ల ముందు కళాకారులు కోలాటం చేశారు. ఆర్కెస్ట్రా భక్తులను అలరించింది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ క్రిష్ణవేణి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



అలంకరణలో చాందినీ బండి

# ఆధారాలు లేని నగదు పట్టివేత

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 15: కంబదూరు మండలంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద సోమవారం పోలీసులు రూ.1.3 లక్షలు సీజ్ చేశారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా సరైన బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేసి డిప్యూటీ తహసీల్దార్ నారాయణ స్వామికి అప్పగించారు.



కంబదూరు చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్న డబ్బు చూపుతున్న అధికారులు

### రూ.3.08 లక్షలు

అనంతపురం క్రైం: స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన శివశంకర్ నాయక్ ఎలాంటి ఆధారాలూ లేకుండా రూ.3.08 లక్షలు తీసుకెళ్తుండగా అనంతపురం టూటౌన్ పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ రుష్యేంద్రబాబు నగరపాలిక కార్యాలయం ఎదుట వాహనాల తనిఖీ చేస్తుండగా.. ఈ నగదును గుర్తించారు. ఆ డబ్బును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.

## చీనీకాయలు టన్ను రూ.37 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.15 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,293 టన్నుల చీనీకాయలు వచ్చాయని వెల్లడించారు.



# పాస్టర్లకు అందని వేతనం

- మూడు నెలలుగా నిరీక్షణ
- రూ.అర కోటికిపైగా పెండింగ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్15: జిల్లాలో మూడు నెలుగా పాస్టర్ల వేతనాలు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. నెలకు ఇచ్చే రూ.ఐదు వేలు కూడా సక్రమంగా ఇవ్వకుండా పెండింగ్ పెడితే ఎలా బతకాలని పలువురు పాస్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీ కార్పొరేషన్ నుంచి మూడు నెలలకు సంబంధించి రూ. అరకోటికి పైగా బిల్లులు రాష్ట్రశాఖకు పంపినప్పటికీ ఇంత వరకూ నిధులు విడుదల కాలేదు. దీంతో ఆ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

### జనవరి నుంచి పెండింగ్

జిల్లావ్యాప్తంగా 352 చర్చిలుండగా... వాటిలో ఒక్కో పాస్టర్‌కు రూ.5 వేలు చొప్పున వేతనాలు అందిస్తున్నారు. ఒక్కో నెలకు వీరి కోసం రూ. 17.60 లక్షలు వ్యయం చేస్తున్నారు. ఈ వేతనాలన్నీ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్నారు. అయితే జనవరి నెల నుంచి వేతనాలు పెండింగ్‌లో పడ్డాయి. ఏప్రిల్ నెల సగం గడిచిపోవడం, ఎన్నికల సమయం కావడంతో వేతనాలు అందుతాయో లేదోనన్న ఆందోళన పాస్టర్ల నుంచి వ్యక్తమవుతోంది.



మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయం

### ఐదేళ్లుగా ఇవ్వకుండా మోసం

ఐదేళ్లుగా పాస్టర్లకు వేతనాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసింది. ఎన్నికలకు ఏడాది ముందు నుంచి వేతనాలకు శ్రీకారం చుట్టారు. వాటిలో కూడా ఈ ఏడాది జనవరి నెల నుంచి మూడు నెలలుగా పెండింగ్‌లో పెట్టారు. ఎటుచూసినా రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్లకు తీరని అన్యాయం చేసింది.



- స్వామిదాస్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ

# ముండ్లవారిపల్లిలో తాగునీటి ఎద్దడి

● పంచాయతీ బోరులో అడుగంటిన భూగర్భజలాలు
● ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు ● పట్టించుకోని అధికారులు

**నంబులపూలకుంట, ఏప్రిల్ 15:** మండలంలోని ముండ్లవారిపల్లిలో గత పది రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రక్షిత తాగునీటి పథకం కింద ఏర్పాటుచేసిన బోరులో భూగర్భజలాలు అడు గంటాయి. దీంతో నీరు చిన్నగా వస్తున్నాయి. ఫలితంగా గ్రామంలో నీటి సమస్య నెలకొంది. చిన్నగా వస్తున్న అరకొర నీటిని గ్రామంలోని ఒక కొళాయి ద్వారా వదులుతున్నారని, వాటిని పట్టుకోవడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఒకేఒక్క కొళాయిలో చిన్న ధారగా వస్తున్న నీటి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందిని, ఈ క్రమంలో నీరు పట్టుకునే విషయంలో గొడవలు సైతం జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. చేసేదిలేక చాలామంది సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని పేర్కొంటున్నారు. గుక్కెడు నీటికోసం పడరాని పాట్లు పడుతున్నా మంటున్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి గ్రామంలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


కొళాయి నుంచి చిన్నగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

## బీసీ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం

● ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి అభ్యర్థి పల్లె సింధూర హామీ

**కొత్తచెరువు, ఏప్రిల్ 15:** మండల కేంద్రంలోని బీసీకాలనీకి మౌలిక వసతులు కల్పిస్తామని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లెసింధూరారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సోమవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమపథకాల గురించి వివరించారు. అనంతరం కాలనీ వాసులు తమ కాలనీలో డ్రైనేజీలు, సీసీరోడ్లు, విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని ఆమె దృష్టికి తెచ్చారు. డ్రైనేజీలేక లేక వర్షాకాలం వస్తే వర్షపు నీరు ఇళ్లలోకి వస్తోందని వాపోయారు. ఇందుకు పల్లె సింధూర మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజల సమస్యల్ని పూర్తిగా విస్మరించిందన్నారు. సీఎం జగన్ ఐదేళ్లకాలంలో ప్రజలకు చేసింది శూన్యమన్నారు. స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సైతం ప్రజల బాగోగులను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. అలాంటి సీఎం, అలాంటి ఎమ్మెల్యే మనకు అవసరమా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమానికి పాటు పడే చంద్రబాబును సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి

### కూటమి అధికారంలోకి రావడం ఖాయం: పల్లె

**బుక్కపట్నం:** రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని పాముదుర్తి పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన 15కుటుంబాల వారు సోమవారం వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లాకేంద్రంలోని పల్లె నివాసంలో వారు పార్టీలోకి చేరారు. పల్లె వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖామన్నారు. నియోజకవర్గంలో పల్లె సింధూరను గెలిపించాలని కోరారు. టీడీపీలోకి చేరిన వారిలో నారాయణస్వామి, మల్లికార్జున, కళ్యాణ్, తిరుపాల్, రామక్రిష్ణ, రామాంజి, గంగాద్రి,చిన్న మునెప్ప తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు ముద్దపాటి రవి, వంశీ పాల్గొన్నారు.


టీడీపీలోకి చేరిన వారితో మాజీమంత్రి పల్లె

### తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

**గాండ్లపెంట, ఏప్రిల్ 15:** మండలంలో నెలకున్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ జగన్‌మోహన్ అధ్యక్షతన జరిగింది. ఇందులో జీన్లకుంట, రెక్కమాను, పోతులవాండ్లపల్లి, నల్లసానివారిపల్లి, కోటపల్లి, మద్దివారిగొంది తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, పరిష్కరించాలని అయా గ్రామాల సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రానివ్వవనిఇ తెలిపారు. తర్వాత ఉపాధి పనులపై ఏపీఓ మంజునాథ్ చర్చించారు. సమావేశంలో ఎంపీడీఓ రామానాయక్, ఎంపీటీసీ సభ్యుడు జయరామక్రిష్ణారెడ్డి, సర్పంచులు సుధాకర్, శివప్పనాయుడు, రాజారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**ముదిగుబ్బ, ఏప్రిల్ 15:** మండలంలోని ఎం కొట్టాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పట్నం పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కదిరి మండలం రాచువారిపల్లి తండాకు చెందిన శంకర్ నాయక్ కుమారుడు అశోక్ నాయక్(28) ఆదివారం అర్ధరాత్రి సమయంలో ముదిగుబ్బ నుంచి స్వగ్రామమైన రాచువారిపల్లితండాకు స్కూటీలో బయలుదేరాడు. కాగా మండలంలోని ఎం కొట్టాల గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో అశోక్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. పట్నం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. మృతుడు డ్రైవర్‌గా జీవనం సాగించేవాడన్నారు. అతడికి ఇంకా వివాహం కాలేదు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 15:** మండలంలోని కర్నాటకనాగేపల్లి కంకరమిషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలవగా.. మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పుట్టపర్తి పట్టణానికి చెందిన టీడీపీ ఈడిగసాధికార సమితి జిల్లా అధ్యక్షుడు ఈడిగనీళ్ల రమణ వ్యక్తి గత పని మీద పుట్టపర్తి నుంచి వెంగళమ్మచెరువు వైపు బైక్‌లో బయలుదేరాడు. కాగా కర్నాటక నాగేపల్లి సమీపంలోని కంకరమిషన్ వద్దకు రాగానే.. వెంగళమ్మచెరువుకు చెందిన యువకుడు బాలాజీ మరో బైక్‌లో ఎదురుగా వేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొన్నాడు. ఘటనలో ఈడిగనీళ్ల రమణ తీవ్రంగా గాయపడగా.. బాలాజీ స్వల్పంగా గాయపడ్డాడు. రమణ పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు హుటాహుటిన అనంతపురం తరలించారు. పుట్టపర్తి రూరల్‌పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### టీడీపీ ప్రచారంలో వైసీపీ కార్యకర్తల కవ్వింపు చర్యలు


టీడీపీ ప్రచారంలో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వైసీపీ కార్యకర్తలు

**కొత్తచెరువు, ఏప్రిల్ 15:** మండల కేంద్రంలోని బీసీకాలనీలో కూటమి టీడీపీ అభ్యర్థి పల్లెసింధూర సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీ జెండాలను చేతపట్టుకుని కవ్వింపు చర్యలకు పాల్పడటంతో పాటు రెచ్చగొట్టేవిధంగా ప్రవర్తించారు. ఈ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. పోలీసులు వచ్చి వైసీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుకోకుండా నచ్చజెప్పి వదిలేశారు. దీంతో పోలీసులు అధికార పార్టీ నాయకులకు అమ్ముడుపోయారా అంటూ ఆ కాలనీ ప్రజలు గుసగుసలాడారు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం విచారించి కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### దిశ డీఎస్పీ కుటుంబానికి ఆర్థికసాయం

**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 15:** జిల్లాలో దిశ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ గతేడాది డిసెంబరులో గుండెపోటుతో మృతి చెందిన వరప్రసాద్ కుటుంబ సభ్యులకు ఎస్పీ మాధవరెడ్డి ఆర్థికసాయం అందజేశారు. జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన డీఎస్పీ కుమారుడు సూర్యతేజకు రూ.లక్ష కార్పస్‌ఫండ్‌కు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ.. పోలీసు శాఖ ఎల్లవేళలా పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందన్నారు. డీఎస్పీ కుటుంబానికి రావల్సిన ఇతర ఆర్థిక సహాయాలను త్వరలోనే అందేవిధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

## ప్రమాణం చేసి చెబుతున్నా.. అభివృద్ధికి కృషి చేస్తా

● టీడీపీ శ్రేణుల సమావేశంలో కూటమి ఎంపీ అభ్యర్థి బీకే హామీ

**ధర్మవరంరూరల్, ఏప్రిల్15:** ప్రమాణం చేసి చెబుతున్నా ధర్మవరం అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తానని హిందూపురం పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకేపార్థసారథి హామీ ఇచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన ధర్మవరం పట్టణ, రూరల్ మండల నాయకులు, కార్యకర్తలతో సమావే శం నిర్వహించి మాట్లాడారు. గతంలో తాను ఎంపీగా, జడ్పీచైర్మన్‌గా ఉన్నప్పుడు ఈ నియోజకవర్గానికి అనేక నిధులు ఇచ్చాననని గుర్తు చేశారు. తాగునీటి కోసం, బస్టాండ్‌లు ఏర్పాటుకు, గ్రామాల అభివృద్ధికి తనవంతుగా ప్రతి మండలానికి నిధులు ఇచ్చానని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో మళ్లీ ఎంపీగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. అలాగే ఎమ్మెల్యేగా సత్యకుమార్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, నాయకులు మహేష్‌చౌదరి, మాజీ ఎంపీపీ మద్దిలేటి, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు, సర్పంచ్ ముత్యాలప్ప నాయుడు, గొట్లూరుశ్రీనివాసు లు, రాఘవరెడ్డి, తలారివెంకటలక్ష్మీ, రాంపురం శీనా, విజయ్‌చౌదరి, పాళ్యం వెంకటేష్, అశ్వర్థనాయుడు పాల్గొన్నారు.


ప్రమాణం చేసి భరోసా ఇస్తున్న బీకే పార్థసారథి

## ఈవీఎం స్ట్రాంగ్‌రూంల భద్రత పటిష్టంగా ఉండాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 15:** ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూంల భద్రత పటిష్టంగా ఉండాలని, నిరంతర సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని కలె క్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వ్యవసాయ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన పుట్టపర్తిఅసెంబ్లీ నియోజకవర్గం, హిందూపురం పార్లమెంటు నియోజవర్గానికి సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను, లాగ్‌బుక్‌ను కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ బాగ్యరేఖ, తహసీల్దార్ వేణుగోపాల్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం స్ట్రాంగ్‌రూంల భద్రత అత్యంత పటిష్టంగా, పకడ్బందీగా ఉండాలన్నారు. ఇందులో ఎటువంటి లోపాలు ఉండరాదన్నారు. స్ట్రాంగ్‌రూంలకు ఎక్కువ ద్వారాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల్లో గట్టిపోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని ఆరు నియోజవర్గాల్లోని 1571 పోలింగ్‌కేంద్రాల్లో 1909 బ్యాలెట్ యూ నిట్లు, 1909 కంట్రోల్‌యూనిట్లు, 2,230 వీవీప్యాట్లు అయా నియోజవర్గాలకు పంపించడం జరిగిందని ఆ యన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపా ల్, డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, పోలీసు సి బ్బంది పాల్గొన్నారు.


స్ట్రాంగ్‌రూంల భద్రతపై ఆర్డీఓతో చర్చిస్తున్న కలెక్టర్

## గ్రామాల్లో కందికుంట ప్రచారం

**కదిరిఅర్బన్, ఏప్రిల్ 15:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముత్యాలచెరువు, కొండమనాయునిపాళ్యం, చవిటి తండా, చిగురుమానుతండా, గొల్లాలచెరువు పంచాయతీలోని గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి కూటమి అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే గ్రామాల్లో నెలకున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటు పడిందని విమర్శించారు. కార్యక్రమంలో కన్వీనర్ చెన్నకేశవులు, తెలుగుయువత బాబ్‌జాన్, హరి, గంగులప్ప, తిరుపాల్‌యాదవ్, రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ముత్యాల చెరువులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కందికుంట

## సూపర్ సిక్స్ పథకాలపై ముమ్మర ప్రచారం

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 15:** మండలంలోని సున్నంపల్లి పంచాయతీలో టీడీపీ నాయకులు సూర్యశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మిట్టపల్లి పంచాయతీలో జిల్లా మైనార్టీ కార్యదర్శి మండోజీ ఆర్ఫిఖాన్, పొగాకు షబ్బీర్, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నిజాం తదితరులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం కాగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. కూటమి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయలని కోరారు. కార్యక్రమాల్లో తెలుగుయువత నాయకులు బూదిలి ఓబులరెడ్డి, బోనాల రామాంజి, బైరిశెట్టి, వీరయ్య, రామాంజి, తుమ్మలప్రసాద్, గంగాధర్, బోనాల లక్ష్మీనారాయణ, సురేంద్ర, శివానంద, చంద్ర, హనుమంతురెడ్డి, నంది నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తనకల్లు:** మండలంలోని ముండ్లవారిపల్లిలో ఆదివారం రాత్రి సూపర్ సిక్స్‌పథకాలపై టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాగేపల్లి చలపతి , వెంకటరెడ్డి, బాగేపల్లి అశోక్ పాల్గొన్నారు.

**ధర్మవరంరూరల్:** మండలంలోని గరుడంపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు సీఎం అవగానే ఈ పథకాలను అమలు చేస్తారని తెలిపారు. ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజనేయులు, సర్పంచ్ ముత్యాలప్పనాయుడు, నాయకులు మహేష్‌చౌదరి, విజయసారథి, పాళ్యంవెంకటేష్, నారాఅశోక్, మల్లి, గరుడంపల్లి చంద్రశేఖర్ బీజేపీ మండల ఇన్‌ఛార్జ్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపరులను తరిమికొడదాం

●ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్

**ధర్మవరం, ఏప్రిల్ 15:** నియోజవర్గంలో పాగా వేసిన అవినీతి పరులను తరిమికొడదామని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమా ర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని 1,2,3,4,5వ వార్డులతో పాటు కొత్తపేట రైల్వేస్టేషన్ సర్కిల్ నుంచి కాలేజీ సర్కిల్ వరకు సోమవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు వివిధ సమస్యల్ని తెలపగా కూటమి అధికారంలోకి వస్తానే అన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి అవినీతి పరులను తరిమికొట్టాలని కోరారు. తనకు ఒక్కఅవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అవినీతి పరులకు చెక్ పెడతానని పేర్కొన్నారు. అలాగే సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ కల్చరల్‌అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎల్ నరేంద్రచౌదరి, టీడీపీ, బీజేపీ నాయకులు కమతం కాటమయ్య, గోనుగుంట్ల విజయ్ కుమార్, ఫణికుమార్, పరిశేసుధాకర్, శీలామూర్తి, పురుషోత్తంగౌడ్,చింతపులుసుపెద్దన్న, భీమనేని ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్

### సత్యకుమార్, బీకే, చిలకం ఆత్మీయ సమావేశం

పట్టణంలో జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్, ఎంపీ అభ్యర్థి బీకేపార్థసారథి కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ముగ్గురు ఎన్నికల వ్యూహంపై చర్చించారు. సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ... కేతిరెడ్డి ఆగడాలను అణచివేయడానికే ధర్మవరానికి వచ్చానన్నారు. ఇక్కడి ప్రజలు ప్రశాంతంగా జీవించేలా చూసుకుంటానని తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. సత్యకుమార్‌యాదవ్, బీకే పార్థసారథిలకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందన్నారు. తర్వాత కూటమి నాయకులు సత్యకుమార్, బీకే, చిలకంను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్తశ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, జయచంద్ర,అడ్డగిరి శ్యాం, వెంకటరెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.


సత్యకుమార్,బీకే, చిలకంను సన్మానిస్తున్న కూటమి నాయకులు

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 15:** అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని జిల్లా అగ్నిమాపకశాఖాధికారి నాగరాజునాయక్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాకేంద్రంలో అగ్నిమాపక సిబ్బంది కవాతు నిర్వహించారు. అనంతరం అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణప్రజలకు అవగాహన కల్పించారు. మంటలను ఆర్పేందుకు ఉపయోగించే వివిధ పరికరాలతో నీటి విన్యాసాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ అగ్నిమాపకశాఖాధికారి మహమ్మద్‌సాధిక్, సిబ్బంది పాల్గొన్నారు.

**ధర్మవరం:** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలోని అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్, కళాజ్యోతి సర్కిల్లో అగ్నిమాపక శాఖ అధికారి ఎం.రాజు ఆధ్వర్యంలో సిబ్బంది వాటర్ డెమో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్రి ప్రమాదాలను ఎలా నివారించాలో అర్థవంతమైన రీతిలో ప్రయోగాత్మకంగా తెలియజేశారు.


పుట్టపర్తిలో అగ్నిమాపక సిబ్బంది నీటివిన్యాసాలు

### సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల పరిశీలన

**కొత్తచెరువు, ఏప్రిల్ 15:** మండలంలోని కేశాపురం, బండ్లపల్లి, లోచర్ల గ్రామాలలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్‌లు సోమవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన చర్యలను ముందుగానే పరిశీలిస్తున్నామన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఇప్పటికే సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లను, వసతులను పరిశీలించామన్నారు. ఎవరైనా ఎన్నికలకు ఆటంకం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట తహసీల్దార్ కళావతి, డీటీ స్వాతి, వీఆర్వోలు ఉన్నారు.

### లోక్ అదాలత్‌కు పోలీసులు సహకరించాలి

**కదిరిలీగల్, ఏప్రిల్ 15:** సత్వర కేసుల పరిష్కరించే లోక్ అదాలత్‌కు పోలీసులు సహకరించాలని న్యాయాధికారి జయలక్ష్మి కోరారు. కదిరి సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో సోమవారం ఆమె మరో న్యాయమూర్తి మీనాక్షి సుందరితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మే 11న జాతీయ మేగా లోక్‌అదాలత్ నిర్వహించడానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. న్యాయస్థానాల ఆశయాలు నెరవేరాలంటే పోలీసుల సహకారం అవసరమన్నారు. స్టేషన్‌ల వారీగా కేసుల జాబితాలను సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏపీపీ సాయిరామక్రిష్ణ, సీఐలు మోహన్, రాజేంద్రనాథ్‌యాదవ్, పోలీసులు పాల్గొన్నారు.

### శ్రీసాయి కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే

**ధర్మవరం, ఏప్రిల్ 15:** పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాల వారు ఫేర్‌వెల్‌డేను స్థానిక దేవాంగ కల్యాణమండపంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ చాంద్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అనంతరం పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్, డైరెక్టర్ పోలా ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

## కందికుంట విజయమే ధ్యేయంగా పని చేయాలి

**తనకల్లు, ఏప్రిల్ 15:** మండలకేంద్రంలోని చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ సమీపంలో తనకల్లు పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం సమావేశం నిర్వహించారు. ఇందులో సీనియర్ నాయకులు దేశాయి విదురశేఖర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, బీగం శంకర్‌నాయుడు, బడా రాజారెడ్డి మాట్లాడారు. కదిరి నియోజకవర్గంలో కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ విజయమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిచడంతో పాటు పోలింగ్ రోజు చేపట్టాల్సిన పోలింగ్ మేనేజ్‌మెంట్‌పై చర్చించారు. ఎన్నికల్లో విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఏమైనా సమస్యలుంటే నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. సమావేశంలో నాయకులు నాగేంద్రప్రసాద్, మహబూబ్‌బాషా, తోట కిషోర్, దేశాయి ప్రభాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుట్టూరు వైద్యాధికారి నాగరాజనాయక్

**పెనుకొండ రూరల్, ఏప్రిల్ 15:** వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుట్టూరు వైద్యాధికారి నాగరాజనాయక్ సోమవారం పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవిలో ఎండలు మండిపోతున్నాయన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండలో ఎక్కువ సేపు గడపరాదన్నారు. తప్పని సరిగా ఎండలో తిరగాల్సి వస్తే తలపై టోపి ధరించాలన్నారు. అదే విధంగా వదులుగా ఉన్న దుస్తులు ధరించాలన్నారు. సాధ్యమైనంత వరకు ఉదయం 10 గంటల లోగా పనులు ముగించుకోవాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వారికి కళ్లు గుంతలు పడటం, పెదాలు ఆరిపోవడం, చర్మం ముదిరిపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. తీవ్రజ్వరం కూడా వస్తుంద న్నారు.. అలాంటి లక్షణాలు కనిపిస్తే ఆ వ్యక్తిని వెంటనే చల్లని ప్రాంతంలో ఉంచాలని తెలిపారు. తడి గుడ్డతో ఒళ్లు తుడవాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి నీరు, మజ్జిగ లాంటివి అందించి వైద్యులను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

## నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు

చర్యలు తీసుకోండి: ఎస్ఎఫ్ఐ


ఎంఈఓ భాస్కర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**మడకశిర రూరల్, ఏప్రిల్ 15 :** నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపడుతున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేశ్ సోమవారం మండల విద్యాశాఖ అధికారి భాస్కర్‌కు వనితిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో కొన్ని ప్రైవేట్ కాలేజీలు అడ్మిషన్ల షెడ్యూల్ విడదల కాకముందే నిబంధనలు తుంగలో తొక్కి అడ్మిషన్లు చేస్తున్నాయన్నారు. విద్యాలయాలను వ్యాపారసంస్థలుగా మారుస్తున్నాయన్నారు. అలాంటి కాలేజీపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే విద్యార్థులతో కలిసి కాలేజీల ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. విద్యార్థి నాయకులు నరేంద్ర, సురేశ్ పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడికి పరామర్శ

**గోరంట్ల, ఏప్రిల్ 15:** టీడీపీ నాయకుడు, సింగల్ విండో మాజీ డైరెక్టర్ రహంతుల్లా అనారోగ్యంతో ఉండగా, పార్టీ నాయకులు పలువురు సోమవారం పరామర్శించారు. రహంతుల్లా అనారోగ్యంతో మంచం పట్టగా నిమ్మల యువశేఖర్ తన అనుచరులతో ఆయన నివాసానికెళ్లి మాట్లాడారు. రహంతుల్లా కుమారుడు టీడీపీ జిల్లా మైనార్టీ సహాయ కార్యదర్శి అజంతుల్లాతో రహంతుల్లా ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు నాగరాజు, వృషభదేవుడు, సాధిక్, హోటల్ చాంద్‌బాషా, బాబావలి, బాబా, షఫీవుల్లా, బాబుల్లా, జయ తదితరులునానరు.

## యువకుడి ఆత్మహత్యాయత్నం

**గోరంట్ల, ఏప్రిల్ 15:** పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన నూర్ అనే యువకుడు కుటుంబ కలహాలతో సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గోరంట్లలోని రాజీవ్‌కాలనీలో నివాసముంటున్న సిరాజ్ కుమారుడు నూర్ ఇంట్లో ఉన్న వివిధ రకాల మాత్రలను మింగి అస్వస్థతకు గురయ్యాడు. అతడిని కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుతాసుపత్రికి తీసుకెళ్లగా, డాక్టర్ ఉష చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

## పొలం నుంచి వస్తుంటే పోలీసులు చితకబాదారు..

రైతు ఆవేదన


గాయపడిన సోమిరెడ్డి

**హిందూపురం, ఏప్రిల్ 15:** పొలంలో పని చూసుకొని వస్తుంటే పోలీసులు చితకబాదారని మండలంలోని రాచపల్లికి చెందిన సోమిరెడ్డి వాపోయాడు. అతడు సోమవారం తన గోడును విలేకరుల వద్ద వెల్లడించాడు. రాచపల్లి సమీపంలోని పొలంలో పని చూసుకొని తాను తిరిగి వస్తున్నానన్నాడు. ఆ సమయంలో పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు అటుగా వెళుతున్న తనను కొట్టారన్నారు. దీంతో కంటిపైన , నుదిటిపై గాయాలయ్యాయని తెలిపారు. గాయపడిన తనను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని అన్నాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా ఆసుపత్రిలో చేర్పించారని తెలిపాడు. దీనిపై అప్‌గ్రేడ్ సీఐ శ్రీనివాసులను వివరణ కోరగా... రాచపల్లి సమీపంలో సోమవారం పేకాడుతున్నట్లు సమాచారం వచ్చిందిని తెలిపారు. సిబ్బంది వెళ్లి దాడి చేయగా రాచపల్లికి చెందిన సోమిరెడ్డి ద్విచక్రవాహనంలో తప్పించుకునే ప్రయత్నం చేసి కింద పడ్డాడన్నారు. అక్కడి నుంచి అతడిని స్టేషన్‌కు తీసుకొచ్చామని తెలిపారు. గాయపడిన అతడిని ఆసుపత్రికి తీసుకెళదామంటే కుటుంబ సభ్యులకు తెలుస్తుందని, అతడే వద్దని చెప్పాడన్నారు. అయినా తామే ఆసుపత్రికి తరలించామన్నారు.

## 'బీఎస్పీతోనే దేశ సమగ్రాభివృద్ధి'

**పావగడ, ఏప్రిల్ 15:** దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే బహుజన సమాజ్‌పార్టీని గెలిపించి మాయావతిని ప్రధాని చేయాలని చిత్రదుర్గం పార్లమెంటు అభ్యర్థి అశోక చక్రవర్తి పేర్కొన్నారు. ఆయన సోమవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్, బీజేపీలు డబ్బులు ఎదజల్లి ఓటుకు ఉన్న విలువను పోగొట్టుతున్నాయని విమర్శించారు. బీఎస్పీ చిత్ర దుర్గం అధ్యక్షుడు ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతరాయ, నాయకులు తిప్పేస్వామి, నరసింహమూర్తి, శ్రీనివాస్, నరేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

## నేడు కాంగ్రెస్ అభ్యర్థి రోడ్‌షో

**పావగడ, ఏప్రిల్ 15:** కాంగ్రెస్‌పార్టీ ఎంపీ చిత్రదుర్గం అభ్యర్థి చంద్రప్ప మంగళవారం తాలూకా వ్యాప్తంగా రోడ్‌షో నిర్వహించనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు రామాంజనప్ప తెలియజేశారు. ఉదయం 10 గంటలకు లింగదహళ్లి, వదనకల్లు, అరసికెరె, కేటీ హళ్లి గ్రామ పంచాయతీలలో రోడ్‌షో ముగుస్తుందన్నారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు వైఎన్ హోసకోట ప్రాంతంలోని గ్రామ పంచాయతీల్లో రోడ్‌షో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప, కౌన్సిలర్లు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

# టీడీపీతోనే ప్రజాసంక్షేమం

✦ బాలయ్యకు ఓటేస్తేనే పురం అభివృద్ధి: వసుంధరాదేవి
✦ రోడ్‌షోలో ప్రజల నీరాజనం


మరవకొత్తపల్లిలో మాట్లాడుతున్న వసుంధరాదేవి

**చిలమత్తూరు, ఏప్రిల్ 15:** టీడీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని హిందూ పురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి పేర్కొన్నారు. ఆమె సోమవారం మండలంలో మూడోరోజు రోడ్‌షో నిర్వహించారు. ఉదయం 8 గంటలకే మరవకొత్తపల్లి నుంచి రోడ్‌షో ప్రారంభించారు. అక్కడి నుంచి లక్ష్మీపురం, వెంకటాపురం, వీరాపురం, హుసేన్‌పురం, భూపసముద్రం, ఆదెప్పల్లి, పాతచామలపల్లి, సంజీవ రాయునిపల్లి, చిలమత్తూరులో భారీ జనసందోహం మధ్యన రోడ్‌షో సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం కోసమే టీడీపీ ఆవిర్భవించిందన్నారు. ఇతర పార్టీలు సంక్షేమం పేరుతో జిమ్మిక్కులు చేస్తున్నాయని, వైసీపీ ఉత్తుత్తి హామీలతో ఐదేళ్లుగా ప్రజలు మోస పోతున్నారన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమంతోపాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. బాలయ్యతోనే హిందూపురం నియోజకవర్గం అభివృద్ధి సాధ్య మన్నారు. ఆయన నిత్యం పురం ప్రజల గురించే ఆలోచిస్తారన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసీ ఎమ్మెల్యేగా బాలయ్యను, ఎంపీగా పార్థసారథిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ రోడ్‌షోలో మహిళలు వసుంధర దేవికి అడుగడుగునా హారతులు పట్టారు. యువతులు, వృద్ధులు ఇలా ప్రతి ఒక్కరు ఆమెతో కరచాలనం చేయడానికి ఎగబడ్డారు.

**టీడీపీలోకి చేరిక :** రోడ్‌షోలో భాగంగా వెంకటాపురానికి వెళ్లిన వసుంధరాదేవి అక్కడ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ స్థానిక నాయకులు రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు వైసీపీ కుటుంబాలు వసుంధర సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ సోదరి లోకేశ్వరి, నాయకులు శ్రీనివాసు, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, డాక్టర్ సురేంద్ర, ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధి తేజస్విని, స్థానిక నాయకులు రంగారెడ్డి, దేమకేతేపల్లి అంజనప్ప, టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బేకరీ గంగాధర్, రఘువర్ధన్‌రెడ్డి, గంగప్ప, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆమె వెంకటా పురం సమీపంలో రోడ్డు పక్కన ఎర్రటి ఎండలో రాగి పంట కోస్తున్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. వారి కష్ట సుఖాలు తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పేదలను ఆదుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కూలీలతో కలిసి ఆమె కొడవలి చేతబట్టి రాగి పంట కోసారు.


రాగి పంట కోస్తున్న వసుంధరాదేవి

# గ్రామాల్లో కూటమి అభ్యర్థులకు విశేష ప్రజాదరణ


గౌనివారిపల్లిలో బీకే పార్థసారథి, సవితకు ఘనస్వాగతం పలుకుతున్న దృశ్యం

**గోరంట్ల, ఏప్రిల్ 15:** మండలంలోని గౌనివారిపల్లి పంచాయతీ గ్రామాల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథికి సోమవారం విశేష ప్రజాదరణ లభించింది. కోరేవాండ్లపల్లి వద్ద టీడీపీ నాయకులు వారికి గజమాలతో స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలోనూ వారిని శాలువ, పూలమాలతో సత్కరిస్తూ, మహిళలు మంగళహారతులతో ఆహ్వానించారు. వారు ఇంటింటికెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వైసీపీ సైకో పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి చాలా వెనుకబడిందన్నారు. గత టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే తప్ప... గ్రామాల్లో ఈ ఐదేళ్లలో జరిగిన పనులు కనిపించడం లేదన్నారు. బళ్లారి, బెంగుళూరు ప్రాంతాల వారిని వైసీపీ ఈ ఎన్నికల బరిలో నిలిపిందన్నారు. ఎమ్మెల్యే శంకర్‌నారాయణ తనకుటుంబ సభ్యులతో కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా దోచుకుని, దాచుకుని వెళ్లిపోయిన మాట వాస్తవం కాదా అని బీకే, సవిత ప్రశ్నించారు. స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గానికి సాగునీరు రావాలన్నా, తాగునీరు కావాలన్నా, యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభించాలన్నా టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మీభవిష్యత్, బాగుండాలంటే మరో వైసీపీని సాగనంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్, కొత్తపల్లి నరసింహులు, నిమ్మల యువశేఖర్, అశ్వర్థరెడ్డి, ఉత్తమరెడ్డి, తిరుపాల్, పసుపులేటి శ్రీనివాసులు, రవిమోహన్, నాగభూషణ, బెల్లాలచెరువు చంద్ర, జనసేన, బీజేపీ నాయకులున్నారు.

### వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పదికుటుంబాలు

గోరంట్ల మండలంలోని మల్లాపల్లికి చెందిన వైసీపీ నాయకుడు మహమ్మద్ ఆధ్వర్యంలో పది కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరారు. గత పంచా యతీ ఎన్నికలత్లో మహమ్మద్‌ను వైసీపీ సర్పంచ్ అభ్యర్థిగా నిరాకరించడంతో స్వతం త్రంగా పోటీ చేశారు. అప్పటినుంచి రాజకీయల పట్ల తటస్థంగా ఉన్నారు. ఆయన టీడీపీ పథకాలకు ఆకర్షితులై గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో పెనుకొండ కూటమి అభ్యర్థి సవిత సమక్షంలో తన అనుచరులతో టీడీపీలో చేరారు. వారికిసవిత కండువా లు కప్పి ఆహ్వానిచారు. వారిలో రామచంద్రారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రామక్రిష్ణప్ప, చాంద్‌బాషా, బాబ్‌జాన్, బోయ వెంకటేష్, ముజామీల్, మురళి తదితరులున్నారు.

## అభివృద్ధి కావాలంటే చంద్రబాబు రావాలి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్


తమ్మడేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న సునీల్‌కుమార్

**మడకశిరటౌన్, ఏప్రిల్ 15:** గ్రామస్థాయి నుంచి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలని, ఆ దిశగా అందరూ ఆశీర్వదిం చాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ కోరారు. ఆయన సోమవారం అమరాపురం మండల పరిధిలోని గౌడనకుంట, దేవగానపల్లి, తమ్మడేపల్లి, వీ అగ్రహారం, వలస, విరుపసముద్రం తదితర గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించాలని, టీడీపీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టే బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారంటీ, సూపర్‌సిక్స్ వంటి కార్యక్రమాలను వివరించారు. పేదల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, అర్హులకు సంక్షేమ ఫలాలు సక్రమంగా అందించలేదన్నారు. గత టీడీపీ హయాంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, కృష్ణా జలాలను మడకశిర నేలకు తాకించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఇప్పటికే ప్రతి చెరువుకు నీరు నింపి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేవారన్నారు. తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించాలని, ఆగిపోయిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఉగ్రనరసింహప్ప, కృష్ణమూర్తి తదితరులతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్‌డీఏ అభ్యర్థుల విజయానికి కృషి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల


సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

**మడకశిరటౌన్, ఏప్రిల్ 15:** కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. ఎన్‌డీఏ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన సోమవారం తుమకూరు ఎంపీ బసవరాజుతో కలిసి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని బీజేపీ ఎంపీ అభ్యర్థి సోమన్న గెలుపుకోసం కృషి చేయాలని గుండుమల తిప్పేస్వామి, బసవరాజు కోరారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ... గతంలో ఎన్‌డీఏ, టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నవ్యాంధ్రప్రదేశ్ ఎంతో అభివృద్ధి చెందిందని, మడకశిర ప్రాంతంలో సైతం నేషనల్ హైవే, రైల్వేలైన్ వంటి వాటిని మంజూరు చేశారని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అవన్నీ ఆగిపోయాయని, తిరిగి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చంద్రబాబు సారథ్యంలో పెండింగ్ పనులన్నీ పూర్తి చేసుకోవచ్చని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు మంజునాథ్, భక్తర్, కృష్ణమూర్తి, మనోహర్, మండలకన్వీనర్ లక్ష్మీనారాయణ, చంద్రప్ప తదితరులు ఉన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ముదిగుబ్బ, ఏప్రిల్ 15:** స్కూటీని గుర్తుతెలియని వాహనం ఢీకొని ఎం కొట్టాల సమీపంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుందని పట్నం పోలీసులు తెలిపారు. పట్నం పోలీసుల వివరాల మేరకు కదిరి మండలం రాచువారిపల్లి తండాకు చెందిన శంకర్ నాయక్ కుమారుడు అశోక్ నాయక్(28) ఆదివారం ముదిగుబ్బ నుండి స్వగ్రామమైన రాచువారిపల్లితాండాకు స్కూటీ వాహనంలో వెళుతుండగా, మండల పరిధిలోని ఎం కొట్టాల గ్రామ సమీపంలోకి రాగానే అర్ధరాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అశోక్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పట్నం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్నం ఎస్ఐ నరసింహులు తెలిపారు. మృతుడు డ్రైవర్‌గా వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

**కొత్తచెరువు, ఏప్రిల్ 15:** మండలంలోని కేశాపురం, బండ్లపల్లి, లోచర్ల గ్రామాలలో ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్‌లు సోమవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన చర్యలను ముందుగానే పరిశీలిస్తున్నామన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఇప్పటికే సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లను, వసతులను పరిశీలించామన్నారు. ఎవరైనా ఎన్నికలకు ఆటంకం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట తహసీల్దార్ కళావతి, డీటీ స్వాతి, వీఆర్వోలు ఉన్నారు.

## డయాలసిస్ రోగుల సమస్యలను పరిష్కరించాలి

**కదిరిఅర్బన్, ఏప్రిల్ 15:** కదిరి ప్రభుత్వ ఏరియా ఆసపత్రిలో డయాలసిస్ రోగులసమస్యలు పరిష్కరించాలని అఖిలభారత చిరంజీవి యువత నాయకులు కోరారు. సోమవారం ఆసుపత్రి సూపరిండెంట్ హుస్సేన్ బాషాకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో డయాలసీస్ చేసుకోవడానికి తగిన పరికరాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, చుట్టుపక్క మండలాలనుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారన్నారు. తగినన్ని గదులు, పరికరాలు లేకపోవడంతో రోగుల అనంతపురం, తిరుపతిలాంటి నగరాలకు వెళ్లి డయాలసిస్‌చేయించుకుంటున్నారన్నారు. ఖర్చులు అధికంగా ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. స్పందించిన సూపరిండెంట్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తతామన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కుటాల లక్ష్మణ్, రాజేంద్ర, చంద్రశేఖర్, సోము, క్రిష్ణ, చక్రీ, మధు, అరవిందు,కార్తీక్ తదితరులున్నారు.

## అగ్ని పట్ల అప్రమత్తంగా ఉండండి

అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్


ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న అగ్నిమాపక అధికారులు

**హిందూపురం, ఏప్రిల్ 15:** ప్రమాద వశాత్తు ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే, అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ అన్నారు. జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని పరుష్కరించుకొని సోమవారం పట్టణంలోని పలు కూడళ్లలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ఎలా ప్రాణాలు రక్షించుకోవాలో తెలియజేశారు. డెమో ద్వారా ప్రజలకు అవగాన కల్పించారు.

# సక్రమంగా విద్యుత్ అందించండి

● రైతు సంఘం డిమాండ్
● పావగడలో ధర్నా


విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

**పావగడ, ఏప్రిల్ 15:** రైతులకు పంట సాగు కోసం అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందజేయాలని రైతు సంఘం తాలూకా ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. స్థానిక తాలూకా కేఈబీ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప మాట్లాడుతూ... వాణిజ్య పంటల సాగుకు అవసరమైన విద్యుత్‌ను రోజుకు రెండు మూడు గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. అందులో లోడ్ సెట్టింగ్, లోఓల్టేజీ, ఎల్‌సీ పేరిట కోతలు విధిస్తుండడంతో పంటలు ఎండకు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం కలిగుతోందని అన్నారు. కోటగుడ్డం, శైలాపురం, పొన్నసముద్రం, ఎర్రంపల్లి ప్రాంతాల్లో రైతులు సాగుచేసిన టమోటా, కర్బూజా పంటలు కరెంట్ కోతల వల్ల తీవ్రంగా దెబ్బతిం టున్నాయని వాపోయారు. వ్యవసాయానికి రోజుకు కనీసం ఆరు గంటలైనా నిరంతరంగా మూడు ఫేసుల విద్యుత్‌ను సరఫరా చేస్తే రైతులకు ఎంతో ఊరట కలుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్‌ను మంగళవారం నుంచి సక్రమంగా అందించకపోతే మళ్లీ ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఈసందర్భంగా వందలాది మందిరైతులు కేఈబీ కార్యాలయానికి చేరుకొని కేఈఓ అధికారి కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేశారు.

## సంక్షేమమే టీడీపీ ధ్యేయం: నాయకులు

**హిందూపురం అర్బన్, ఏప్రిల్ 15:** సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా టీడీపీ పని చేస్తుందని ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. పరిగి మండల ఊటుకూరు పంచాయితీలోని ఊటకూరు, యూ బసవనపల్లి, దాసిరిపల్లి, అక్కంపల్లి, నేతులపల్లిల్లో వారు సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ ధనాపురం సూరి, మాజీ సర్పంచ్‌లు ఈశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి ప్రతి గడపకు వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహేష్, ప్రవీణ్‌రెడ్డి, వెంకటలక్ష్మి, లలితమ్మ, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

**పెనుకొండ రూరల్, ఏప్రిల్ 15:** రాష్ట్రం, ప్రజల సంక్షేమం, అభివృద్ధి జరుగాలంటే చంద్రబాబునాయుడితోనే సాధ్యమని మాజీ ఎంపీపీ కేశవయ్య పేర్కొన్నాడు. మండలంలోని అడుదాకులపల్లిలో సోమవారం టీడీపీ శ్రేణులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరుగుతూ టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మాజీ సర్పంచ్ ఈశ్వర్ ప్రసాద్, లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి, బాబుల్‌రెడ్డి, బోయనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు గుర్తింపు

అంజినప్పను సన్మానించిన వడ్డెర నాయకులు

**హిందూపురం అర్బన్, ఏప్రిల్ 15:** బడుగు బలహీన వర్గాలను పార్టీ ఆవిర్భావం నుంచి గుర్తించిన ఏకైక పార్టీ టీడీపీ మాత్రమే అని వడ్డెర సంఘం నాయకులు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వడ్డెర కులానికి చెందిన కొల్లకుంట అంజనప్పను నూతనంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ పరిగి మండలం నాయకుడు, వడ్డెర సాధికార కమిటీ జిల్లా సభ్యుడు హనుమయ్య నేతృత్వంలో వడ్డెర కులస్థులు అంజనప్పను సోమవారం కలిశారు. అంజనప్ప స్వగృహంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంజనప్పను జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయుడు ఆదినారాయణ, నవీన్, పెనుకొండ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాగప్ప, చంద్ర, గంగాధర్, మారేష్, నారాయణస్వామి, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కొల్లకుంట అంజినప్పను పట్టణం, రూరల్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కలిసి ఘనంగా సత్కరించారు. ఆయనను అభినందించన వారిలో హిందూపురం పట్టణ నాయకులు మంగేష్, వెంకటేష్, చంద్రమోహన్, నవీన్, రాఘవేంద్ర, రమేష్, మోద శివ, నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

## కోడ్ పట్టించుకోరా..!



ఆరోగ్యకేంద్రంపై తొలగిన వైఎస్ఆర్ పేరు

**మడకశిర రూరల్, ఏప్రిల్ 15 :** రాజకీయ పార్టీల జెండాలు, రంగులు, నాయకుల విగ్రహాలు, గుర్తులు,పేర్లు ఇలా ఓటర్లను ప్రభావితం చేసేవి ఏవీ బహిరంగంగా కనించకూడదని ఎన్నికల సంఘం నిర్దిష్ట అదేశాలు జారీ చేసింది. ఎన్నికల కోడ్ నియమావళిపై ఆర్ఓ ఆధ్వర్యంలో స్థానిక అధికారులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. కోడ్ వచ్చి నెల రోజులు అవుతున్నా కొంత మంది అధికారులు దాని అమలు విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ప్రజలు వాపోతున్నారు. మడకశిర పట్టణంలోని ఆరోగ్య కేంద్రం భవనాలను కొత్తగా నిర్మించారు. వాటికి డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రంగా పేరు పెట్టారు. అదే విధంగా భవనానికి వైసీపీ రంగులు వేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందుకు వాటిని తొలగించే విషయమ్మై ఆ శాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు

## దిశ డీఎస్పీ కుటుంబానికి ఆర్థికసాయం

**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 15:** జిల్లాలో దిశ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ గతేడాది డిసెంబరులో గుండెపోటుతో మృతి చెందిన వరప్రసాద్ కుటుంబ సభ్యులకు ఎస్పీ మాధవరెడ్డి ఆర్థికసాయం అందజేశారు. జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన డీఎస్పీ కుమారుడు సూర్యతేజకు రూ. లక్ష కార్పస్‌ఫండ్‌కు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసు శాఖ ఎల్లవేళలా పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందన్నారు. డీఎస్పీ కుటుంబానికి రావల్సిన ఇతర ఆర్థిక సహాయాలను త్వరలోనే అందేవిధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 15:** మండలంలోని కర్ణాటకనాగేపల్లి కంకరమిషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలవగా.. మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పుట్టపర్తి పట్టణానికి చెందిన టీడీపీ ఈడిగసాధికార సమితి జిల్లా అధ్యక్షుడు ఈడిగనీళ్ల రమణ వ్యక్తి గత పని మీద పుట్టపర్తి నుంచి వెంగళమ్మచెరువు వైపు బైక్‌లో బయలుదేరాడు. కాగా కర్ణాటక నాగేపల్లి సమీపంలోని కంకరమిషన్ వద్దకు రాగానే.. వెంగళమ్మచెరువుకు చెందిన యువకుడు బాలాజీ మరో బైక్‌లో ఎదురుగా వేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొన్నాడు. ఘటనలో ఈడిగనీళ్ల రమణ తీవ్రంగా గాయపడగా.. బాలాజీ స్వల్పంగా గాయపడ్డాడు. రమణ పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు హుటాహుటిన అనంతపురం తరలించారు. పుట్టపర్తి రూరల్‌పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.